# సాక్షి సూర్యాపేట

బుధవారం । 8 । అక్టోబర్ । 2025






**ముగ్గురి అరెస్ట్**
గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.
- 8లో



**తెగుళ్ల నివారణపై అవగాహన**
పంటల్లో వచ్చే తెగుళ్లపై మంగళవారం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు.
- 8లో

**సాగర్ సమాచారం**



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

| | | |
|---|---|---|
| ప్రస్తుత నీటి మట్టం | : | 589.70 అడుగులు |
| ఇన్‌ఫ్లో | : | 2,29,950 క్యూసెక్కులు |
| అవుట్ ఫ్లో | : | 2,29,950 క్యూసెక్కులు |
| విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా | : | 33,170 క్యూసెక్కులు |
| కుడికాల్వ ద్వారా | : | 10,040 క్యూసెక్కులు |
| ఎడమకాల్వ ద్వారా | : | 8,022 క్యూసెక్కులు |
| ఏఎమ్మార్పీకి | : | 1,200 క్యూసెక్కులు |
| వరద కాల్వకు | : | నిల్ |

## న్యూస్‌రీల్

### పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి



నేరేడుచర్ల : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(పీఆర్‌టీయూ టీఎస్) సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నేరేడుచర్లకు చెందిన ఉపాధ్యాయుడు కొణతం వెంకట్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ(టీఎస్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పులగం దామోదర్ రెడ్డి, సుంకరి భిక్షం గౌడ్‌ల ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తంగేళ్ల జితేందర్ రెడ్డి, తీగల నరేష్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దండుగల ఎల్లయ్య, మేకల రాజశేఖర్, గోదేశి దయాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యూసుఫ్, పాలకవీడు మండల అధ్యక్ష, కార్యదర్శులు కొండా బాలకృష్ణ, గంధం ధర్మరాజు, మండల అసోసియేట్ అధ్యక్షులు అంజయ్య, మొహమ్మద్ జహీర్‌ఖాన్, ప్రగడ శేఖర్, నాగశంకర్, రాజేష్, శ్రీనివాస్, కొండయ్య, నాగరాజు, రమేష్, నారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, తిరుపతయ్య, సూర్యం, బ్రహ్మానందం తదితరులు కొణతం వెంకట్‌రెడ్డిని అభినందించి హర్షం వ్యక్తం చేశారు.


### విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

పెన్‌పహాడ్ : వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని, సకాలంలో హాజరుకావాలని డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల గుర్తింపును వేగవంతం చేయాలని కోరారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, మాతాశిశు సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను సమర్థంగా నిర్వహించాలన్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల వద్ద ఎంఎల్‌హెచ్‌పీలు రోజుకు 30 నుంచి 35మంది వరకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వ్యాక్సిన్‌తో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈసమావేశంలో మండల వైద్యాధికారి రాజేష్, హెచ్‌ఈఓ వెంకన్న, సూపర్‌వైజర్‌లు వెంకయ్య, పూలమ్మ, అన్ని గ్రామాల హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### మూసీ నాలుగు గేట్లు ఎత్తివేత



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న వరదనీరు

కేతేపల్లి : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. మంగళవారం ఈ ప్రాజెక్టులోకి 5,854 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు నాలుగు క్రస్ట్‌గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 5,376 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 532 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సీపేజ్, లీకేజీ, ఆవిరి రూపంలో మరో 49 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రం వరకు 644.05 అడుగులు (4.21 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

### అధ్యాపకులకు శిక్షణ

నల్లగొండ టూటౌన్ : ప్రతివిద్యార్థి సబ్జెక్టులో మెరుగైన అభ్యసనాన్ని, సాంకేతికంగా మూల్యాంకనం చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని ఎంజీయూ గణితశాస్త్ర విభాగం అధ్యాపకురాలు హైమావతి వివరించారు. నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీలో మంగళవారం యూనివర్సిటీ అధ్యాపకులకు అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్‌పై శిక్షణలో ఆమె మాట్లాడారు. ప్రోగ్రాం, కోర్స్ లక్ష్యాల ఆధారంగా మూల్యాంకన విధానాన్ని అధ్యాపకులకు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అలువల రవి, మిర్యాల రమేష్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



**కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి**

భానుపురి: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అదనపు కలెక్టర్ సీతారామారావు, అధికారులు

### సీజేఐపై దాడి హేయమైన చర్య

సూర్యాపేట అర్బన్: సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పైనే ఓ మతోన్మాది షూ విసిరే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బరితెగించిన మతోన్మాది రాకేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి దేశ ప్రజలకు ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ పరివార్ శక్తులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత చరిత్రలో ఇది చీకటి రోజు అని పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి పైన దాడి మాత్రమే కాదు, రాజ్యాంగంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. భారత సమాజం గవాయ్ కు అండగా నిలవాలని కోరారు.

# దూది.. మద్దతు ఏది?



ఈ ఫొటోలో ఉన్న రైతు చిలుముల గోపాల్ రెడ్డి ది ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రం. వానాకాలం 5 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. వరుసగా కురిసిన వర్షాలకు పత్తి చేలు చాలావరకు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ పగిలిన పత్తిని కూలీలతో ఏరించాడు. జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో వరంగల్‌కు వెళ్లి రెండు క్వింటాళ్ల పత్తిని విక్రయిస్తే కేవలం రూ.7100 మాత్రమే ధర పడింది. కూలీలకు, వరంగల్ కు వెళ్లి రావడానికి ఈ డబ్బులు సరిపోయాయి.

**పత్తి చేతికొస్తున్నా ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు**

- పంటల నమోదు పూర్తికాక కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు
- తేమ ఉందని, నాణ్యత లేదని కొర్రీలు
- క్వింటాకు రూ.7వేల వరకే చెల్లింపు
- నష్టపోతున్న కర్షకులు



నాగారం: ఫణిగిరిలో ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి

భానుపురి (సూర్యాపేట) : పత్తిని నమ్ముకున్న రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. పత్తి ఏరివేత పనులు మొదలై పంట చేతికొస్తున్నా సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాలు ప్రారంభం కాలేదు. ఈ పంటసాగుతో పాటు ఇతర అవసరాలకు తెచ్చిన అప్పులు తీర్చేందుకు జిల్లాలోని రైతులు.. ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా చేసుకొని తేమ ఉందని, నా ణ్యత లేదని, రంగుమారిందని నానా కొర్రీలు పెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.5వేల నుంచి రూ.7వేలకు ఖరీదు చేస్తున్నారు.

**'కిసాన్ కపాస్ యాప్'తో..**

నెలన్నరగా వ్యవసాయ శాఖ అధికారులు యూరియా సరఫరాలో నిమగ్నమయ్యారు. ఈ కారణంగా పంటల నమోదు (క్రాప్ బుకింగ్) కొంత ఆలస్యంగా నడుస్తోంది. ఈప్రక్రియ పూర్తయ్యాక పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని సీసీఐ స్పష్టం చేసింది. అలాగే పత్తి కొనుగోళ్లలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ఈసారి కొత్తగా కిసాన్ కపాస్ యాప్‌ను తీసుకొచ్చింది. దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి దానిని సీసీఐ కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందుతున్నారు. 'కిసాన్ కపాస్ యాప్'లో నమోదైన రైతుల నుంచి మాత్రమే పత్తి కొంటామని సీసీఐ ప్రకటించింది. కౌలు రైతులూ ఇదే యాప్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఇందుకోసం లాగిన్ సదుపాయాన్ని మండల వ్యవసాయశాఖ అధికారులకు అప్పగించింది. రైతులు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీ, సమయానుసారం పత్తిని విక్రయించాల్సి ఉంది. ఈనెల 8వ తేదీన ఈ యాప్‌పై నల్లగొండ జిల్లాలో సూర్యాపేట జిల్లాకు చెందిన ఏఈఓలకు శిక్షణ ఇచ్చి వారం, పదిరోజుల్లోనే పత్తి సాగు చేసిన రైతుల వివరాలు నమోదు చేయనున్నారు.

**ఆరు కేంద్రాల ఏర్పాటుకు అవకాశం..**

సూర్యాపేట జిల్లాలో 90వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఎకరానికి 8 క్వింటాళ్ల చొప్పున సుమారుగా 7.20 లక్షల క్వింటాళ్ల దిగుబడి రానుంది. ఈ పత్తిని జిల్లాలో ఉన్న ఆరు జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసే సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయనున్నారు. సూర్యాపేట సమీపంలోని బాలెంలలో ఒకటి, తిరుమలగిరిలో మూడు, చింతలపాలెంలో రెండు చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**వరంగల్, ఖమ్మం మార్కెట్లకు తరలించి..**

కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ.8110 నిర్ణయించింది. కానీ ప్రైవేట్ వ్యాపారులు, దళారులు రూ.7వేలకు మించి ధర చెల్లించడం లేదు. సీసీఐ కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో వరంగల్, ఖమ్మం మార్కెట్లకు తరలించి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు.

**తక్కువ ధరకు అమ్ముకున్నాం**



ప్రభుత్వం వెంటనే సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఈ కేంద్రాలు లేకపోవడంతో వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయించాల్సి వస్తోంది. ఈ వానాకాలం నాలుగు ఎకరాల్లో పత్తి వేస్తే 5క్వింటాళ్ల పత్తి తీశాం. వరంగల్‌కు వెళ్లి అమ్మితే కేవలం క్వింటాకు రూ.5200 ధర పడింది. పత్తిని సాగు చేస్తే ఏం లాభం లేకుండా పోతోంది. పెట్టుబడులు రావడం లేదు.

– చిత్తలూరి నాగరాజు, రైతు, ఆత్మకూర్

**రైతులు తొందరపడి అమ్ముకోవద్దు**

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే జిల్లాలో 6 సీసీఐ కేంద్రాలు ప్రారంభిస్తాం. రైతులు తొందరపడి దళారులు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు పత్తిని విక్రయించొద్దు. మరో 15, 20 రోజుల్లో కేంద్రాల ఏర్పాటుకు అవకాశముంది.

– సంతోష్‌కుమార్, మార్కెటింగ్ అధికారి

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్



సూర్యాపేట జిల్లా కోర్టు ఆవరణను ఊడుస్తున్న న్యాయమూర్తులు తదితరులు

చివ్వెంల(సూర్యాపేట) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని సూర్యాపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్ పేర్కొన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీపుర్లతో ఊడ్చారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యాధుల కాలం కాబట్టి ప్రజలు తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడం తోపాటు, తమ పరిసరాల్లో చెత్త వేయకుండా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, అనారోగ్యాలకు దూరంగా ఉండాలన్నారు. చెత్త చెదారాన్ని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల ట్రాక్టర్లలో పడవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి నగూరి అపూర్వ రవళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, డిఫెన్స్ కౌన్సిల్స్ బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, ఏజీపీ షఫీఉల్లా, పోలీసులు పాల్గొన్నారు.

**ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి**

చివ్వెంల(సూర్యాపేట) : ఖైదీల ఆరోగ్యం విషయంలో జైలు అధికారుల ప్రత్యేక శ్రద్ధవహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్ సూచించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్ జైలును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెను వివరాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలు, ఖైదీల గదులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్స్ బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, న్యాయవాదులు గుంటూరు మధు, కట్టా సుధాకర్ , జైలు సిబ్బంది పాల్గొన్నారు.

### మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేసి స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆ తర్వాత ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం నిత్యకల్యాణతంతు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

# హైకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకోవాలి



సూర్యాపేట పట్టణంలో నిరసన తెలుపుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టులో రెడ్డి జాగృతి నాయకుడు మాధవరెడ్డి వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నరసింహ కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుమేరకు మంగళవారం సూర్యాపేట పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం కల్పించే 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీలమంతా ఏకమై తరిమికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్ రావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు భూపతి నారాయణ గౌడ్, దాసరి వెంకన్న యాదవ్, నాయకులు శ్రీకాంత్, సంపత్ నాయుడు, సుదర్శన్, శ్రీనివాస్, విజయ్ కృష్ణ, దశరథ, రమేష్, వాసుదేవ్, నాగేందర్, రామచంద్ర యాదవ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నరేష్, జానకి రాముడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# పొరపాట్లకు తావివ్వొద్దు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



ఎన్నికలపై నిర్వహించిన మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్లు మొదలుకొని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎలాంటి తప్పు జరగకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా నామినేషన్ల సందర్భంగా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొదటి విడత సూర్యాపేట డివిజన్‌లోని 11 మండలాల్లో 112 ఎంపీటీసీ స్థానాలు, రెండో విడత కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్లలోని 12 మండలాల్లో 123 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మొదటి విడతన అక్టోబర్ 9న, రెండవ విడత ఎన్నికలకు అక్టోబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. మాస్టర్ ట్రైనర్ రమేష్ జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియపై పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

**మాక్ డ్రిల్..**

నామినేషన్ల స్వీకరణ, నోటిఫికేషన్ జారీలో ఎలాంటి తప్పులు, కొట్టివేతలు, దిద్దిబాట్లు ఉండకూడదని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆదేశాల ప్రకారం 9వ తేదీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ జారీతో పాటు, ఓటరు జాబితా సైతం ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్ని మండలాల ఆర్‌ఓలు, సహాయ రిటర్నింగ్ అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, స్వీకరించాల్సిన ధ్రువపత్రాలు ఇతర అన్ని అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ యాదగిరి, డీఎఫ్ఓ సతీష్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టంతో పారదర్శకత

భానుపురి (సూర్యాపేట) : సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత పౌర సమాచార అధికారులు, పబ్లిక్ అథారిటీలపై ఉందన్నారు. ఆయా పబ్లిక్ అథారిటీలు వారి దగ్గర ఉన్న సమాచారాన్ని పౌరులు కోరితే ఇవ్వాలని, ఏ పద్ధతిలో సమాచారం కోరితే అలా ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, ఎట్టి పరిస్థితుల్లో తప్పుడు సమాచారం ఇవ్వద్దన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీఆర్డీఓ అప్పారావు, డీపీఓ యాదగిరి, డీఎఫ్ఓ సతీష్ పాల్గొన్నారు.

# నేరాల నిరోధానికి పటిష్ట ప్రణాళిక



హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్పీ నరసింహ

- ఎస్పీ నరసింహ

హుజూర్‌నగర్ : నేరాల నిరోధానికి పటిష్ట ప్రణాళిక అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌తో పాటు సీఐ కార్యాలయాన్ని ఎస్పీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు వేగంగా పోలీసు సేవలు అందిస్తే ప్రజల్లో మరింత గౌరవం పెరుగుతుందన్నారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కోర్టు విధులను పటిష్టంగా నిర్వహిస్తూ కేసుల్లో ఎక్కువ శిక్షలు పడేలా పోలీస్ సిబ్బంది కృషి చేయాలని అన్నారు. సైబర్ మోసాలు జరగకుండా ప్రజలను చైతన్యంచేయాలని, రోడ్డు ప్రమాదాల వల్ల ఎవరూ మరణించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. హుజూర్‌నగర్‌ను సేఫ్ టౌన్ ప్రాజెక్టుగా తీసుకున్నామని తెలిపారు. అందులో భాగంగా సర్కిల్ పరిధిలో 150 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. సర్కిల్ పరిధిలోగల హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధి నుంచి 50 కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రణాళిక చేశామన్నారు. దీని ద్వారా అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, నేరాలు నిరోధించడం సులువు అవుతుందన్నారు. స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. సిబ్బంది కవాతు, యూనిఫామ్, పోలీస్ పరికరాలను, పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరి బాబు, సీఐ చరమందరాజు, ఎస్‌ఐలు మోహన్ బాబు, రవీందర్, నరేష్, బాబు, కోటేష్, ఆర్ఎస్ఐ అశోక్, డీసీఆర్‌బీ సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్, సీసీ సందీప్ పాల్గొన్నారు.

# వందశాతం ఉత్తీర్ణతే పరమావధి

- కొనసాగుతున్న పదో తరగతి ప్రత్యేక తరగతులు
- డిసెంబర్ వరకు సాయంత్రం వేళ
- జనవరి నుంచి రెండు పూటలా...
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



నాగారం జెడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

| | |
|---|---|
| జెడ్పీ ఉన్నత పాఠశాలలు | 182 |
| కేజీబీవీలు | 18 |
| ఆదర్శ పాఠశాలలు | 09 |
| పదవ తరగతి విద్యార్థుల సంఖ్య | 5,345 |

నాగారం : పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో సెప్టెంబర్–1 నుంచి జిల్లా పరిషత్, కేజీబీవీ, ఆదర్శ, ఎయిడెడ్ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. డిసెంబర్ నెలాఖరు వరకు సాయంత్రం వేళ, ఆ తర్వాత 2026 జనవరి–1వ తేదీ నుంచి ఉదయం, సాయంత్రం సమయాల్లో రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

**నిర్వహణ ఇలా...**

ఈ ఏడాది జిల్లాలో 5,345 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతిరోజు ఒక సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతి నిర్వహించడం, ముఖ్యమైన అంశాలను చదివించడం, విద్యార్థులు వెనుకబడకుండా చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబరు31వ తేదీ వరకు సాయంత్రం 4:20 నుంచి 5:20 గంటల వరకు ప్రతిరోజు ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. అలాగే జనవరి–1 నుంచి వార్షిక పరీక్షల వరకు ఉదయం, సాయంత్రం రెండు పూటలు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్రత్యేక తరగతులు చేపట్టనున్నారు. విద్యారులు తప్పనిసరి హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులతో సమావేశాలు నిర్వహిస్తూ..... వారి ప్రగతి పై చర్చించాలి. హెచ్ఎంలు పర్యవేక్షిస్తూ చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఆయా సామర్థ్యాల ఆధారంగా లఘు పరీక్షలు పెట్టాలి. విద్యార్థుల జవాబు లను పరిశీలించి చర్చలతో సరిదిద్దాలి. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ఉత్తమ ఫలితాల సాధన దిశగా ప్రేరణ కల్పిస్తున్నారు. వచ్చే జనవరి 10 నాటికి సిలబస్ పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రతి వారం ఒక్కో పాఠ్యాంశంపై పరీక్ష నిర్వహించి ప్రతిభను అంచనా వేసి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారు.

**అభ్యాస దీపికలతో సన్నద్ధం**

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో.. ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన అభ్యాస దీపికలతో విద్యార్థులను సన్నద్ధం చేయిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు అవసరమైతే ఉదయం, సాయంత్రం రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

**లక్ష్యం సాధించేలా చూడాలి**



పదోతరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణులను చేయడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు ముందుకు వెళ్లాలి. ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా రిజిస్టర్ నిర్వహించాలి. పర్యవేక్షణ అధికారులతో సలహాలు, సూచనలు సేకరించాలి. సబ్జెక్టు టీచర్లు సమన్వయంతో లక్ష్యం సాధించేందుకు శ్రమించాలి.

–అశోక్, డీఈఓ, సూర్యాపేట.

**గతేడాది ఉత్తీర్ణత...**

2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో 96.81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా 14వ స్థానంలో నిలిచింది. ఈసారి వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.

క్లుప్తంగా

## యాదగిరీశుడికి బంగారు ప్రభ అందజేత



ఆలయ అధికారులకు ప్రభను అందజేస్తున్న భక్తులు

**యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఖడ్గేకార్ జగదీశ్వర్, భాగ్యవతి, వినయ్, ఈషా, గరుడపల్లి బాలేష్ గుప్త, అన్నపూర్ణదేవి, శివప్రసాద్, స్రవంతి కలిసి రూ.3లక్షల విలువ చేసే ప్రభను అందజేశారు. మంగళవారం స్వామివారిని దర్శించుకొని, అనంతరం ముఖ మండపంలోని ఆలయ అధికారులు, అర్చకులకు రాగి రేకుపై బంగారు పూతతో కూడిన ప్రభను అందజేశారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**తుర్కపల్లి:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. తుర్కపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఒంగోలు జిల్లా కేంద్రానికి చెందిన శ్రీను ఉపాధి నిమిత్తం భువనగిరికి వలస వచ్చి మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం మేస్త్రీ పని నిమిత్తం భువనగిరి నుంచి తుర్కపల్లి మండలంలోని రామోజీనాయక్ తండాకు వస్తుండగా పెద్దతండా గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తక్యుద్దీన్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

**అడవిదేవులపల్లి:** అడవిదేవులపల్లి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ భూమి వద్ద సోమవారం రాత్రి కురిసిన గాలివానకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మంగళవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన దాసరి సైదయ్య, కలకొండ భిక్షం, రావుల దుర్గయ్య, కొత్త మట్టయ్యకు చెందిన నాలుగు గేదెలు మేతకు వెళ్లి సమీపంలోని అయ్యేరు కుంటలో నీరు తాగి వస్తుండగా ఆ విద్యుత్ తీగలకు తాగి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

**భువనగిరి:** ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి భువనగిరి బస్టాండ్‌లోకి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలిని హైదరాబాద్ నుంచి హన్మకొండకు వెళ్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వృద్ధురాలిని చికిత్స నిమిత్తం భువనగిర జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

# గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

- 120 కిలోల గంజాయి సీజ్

**సూర్యాపేటటౌన్:** గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 120 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను మంగళవారం సూర్యాపేట ఎస్పీ నరసింహ జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. హైదారాబాద్‌కు చెందిన కణం రమేష్ నిత్యాన్నదానం చేసే ఆశ్రమాలకు బియ్యం సప్లై చేస్తుంటాడు. సరైన ఆదాయం లేక మిల్లర్లకు డబ్బు చెల్లించలేకపోయాడు. వ్యాపారం బాగోలేదని మానసిక ప్రశాంతత కోసం కుటుంబానికి దూరంగా ఉండి ఓం శాంతి బ్రహ్మకుమారి ఆశ్రమంలో తిరుగుతుండగా.. అతడికి ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన ఎరకమ్మ అలియాస్ రోహిణి పరిచయమైంది. వీరిద్దరు కలిసి గత రెండేళ్ల నుంచి విజయవాడలో ఉంటూ బియ్యం వ్యాపారం చేయగా మళ్లీ నష్టం వచ్చింది. దీంతో గంజాయి వ్యాపారం చేస్తే తన అప్పులు తీరుతాయని రమేష్ ఎరకమ్మకు చెప్పగా ఆమె సరే అంది. ఇరువురు కలిసి విజయనగరం జిల్లాకు చెందిన అశోక్‌ను విజయవాడకు పిలుపించుకున్నారు.




నిందితులను చూపుతున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ

**కోదాడ శివారులో 110 కిలోల గంజాయి..**

అశోక్ ద్వారా ఒడిశా నుంచి 110 కిలోల గంజాయిని సెప్టెంబర్ 22న విజయవాడకు తెప్పించుకొని.. దానిని రమేష్ బస్తాలలో ప్యాక్ చేసి తన కారులో సెప్టెంబర్ 23న హైదరాబాద్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో కోదాడ పట్టణ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండటం గమనించాడు. పోలీసులకు దొరికిపోతామనే భయంతో కోదాడ శివారులోని భారత్ పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఒక షెడ్ లోపలికి వెళ్లి 110 కిలోల గంజాయిని పడేశాడు. అనంతరం ఈ నెల 5వ తేదీన మళ్లీ 10 కిలోల గంజాయిని ఒడిశా నుంచి తెప్పించి.. ఈ నెల 6న ఆ గంజాయిని హైదరాబాద్‌లో అమ్మేందుకు రమేష్ కారులో బయల్దేరారు. కోదాడ పట్టణ శివారులోని కట్టకొమ్ముగూడెం ఎక్స్ రోడ్ దగ్గరకు రాగానే పోలీసులను చూసి కారు వేగంగా వెళ్తుండటంతో పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. రమేష్ వద్ద 10 కిలోల గంజాయి, 6 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. రమేష్‌ను విచారించగా.. గత నెల కోదాడ వద్ద 110కిలోల గంజాయిని ఎరకమ్మ, అశోక్‌లతో కలిసి వదిలేసినట్లు ఒప్పుకోవడంతో వారిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

# అద్భుత క్షేత్రాన్ని అచ్చుగుద్దినట్లుగా..

**యాదగిరిగుట్ట:** యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఓ చిత్రకారిణి తన కుంచెతో అద్భుతంగా గీసి భక్తులను ఆకట్టుకుంది. భువనగిరి పట్టణానికి చెందిన నామోజు లావణ్య మంగళవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు యాదగిరీశుడి ఆలయ కల్యాణ మండపం నుంచి ఆలయాన్ని చూస్తూ ప్రత్యక్షంగా చిత్రాన్ని గీసింది. ఆలయ నిర్మాణం, సప్త గోపురాలు, బంగారు విమాన గోపురం, మాఢ వీధుల్లో భక్తులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలను అచ్చుగుద్దినట్లు గీసి రంగులతో తీర్చిదిద్దింది. ఆలయ రూపాన్ని లావణ్య ఎడమ చేతితో గీస్తుంటే భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. తాను గీసిన చిత్రాన్ని ఆలయాధికారులకు లావణ్య అందజేసింది. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. తాను కొంతకాలంగా ఆలయాలను, పర్యాటక ప్రదేశాలకు వెళ్లి చిత్రాలు గీసి, నిర్వాహకులకు అందిస్తున్నట్లు వెల్లడించింది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఉన్న ఆలయాలను సందర్శించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే భద్రాచలం, చార్మినార్, స్వర్ణగిరి, ఏపీలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం, ఖైరాతాబాద్ గణపతి, వెయ్యి స్తంభాల గుడి సందర్శించి చిత్రాలను గీసినట్లు తెలిపింది. తాను డిగ్రీ వరకు చదువుకున్నానని, చిత్రాలు ఎడమచేతితో గీస్తున్నట్లు వెల్లడించింది.



ఆలయాన్ని చూస్తూ బొమ్మ గీస్తున్న లావణ్య

## తాళం వేసిన ఇంట్లో చోరీ

- 6తులాల బంగారం, రూ.80వేల నగదు అపహరణ

**మిర్యాలగూడ అర్బన్:** తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో సోమవారం రాత్రి వెలుగుచూసింది. వన్‌టౌన్ పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చామల పార్వతి రోజు మాదిరిగానే సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లింది. విధులు ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకున్న ఆమె తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించింది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నల్లగొండ నుంచి క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. 6తులాల బంగారం, రూ.80వేల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు పేర్కొంది. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

**చిత్రియాలలో..**

**చందంపేట:** చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో మంగళవారం ఉదయం ఓ ఇంట్లో చోరీ జరిగింది. చిత్రియాల గ్రామానికి చెందిన జూలూరి మహేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని మూడున్నర తులాల బంగారం, 65 తులాల వెండి, రూ.61వేల నగదు అపహరించారు. ఇంటికి వచ్చి చూసిన మహేష్ సామగ్రి చిందరవరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. డిండి సీఐ బీసన్న, ఎస్‌ఐ లోకేష్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# స్వర్ణగిరిలో ముగిసిన పవిత్రోత్సవాలు

**భువనగిరి:** భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 3న ప్రారంభమైన పవిత్రోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు యాగశాలలో చతుస్థానార్చన, మూలమంత్ర హవనం, అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించి మహాపూర్ణాహుతి గావించారు. అనంతరం స్వామివారికి నిత్య కల్యాణం జరిపించారు. అనంతరం మహాకుంభప్రోక్షణ, గోష్ఠి కార్యక్రమం, రాత్రి శరత్ పౌర్ణమి సందర్భంగా గోదోహనం నిర్వహించిన అనంతరం గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాప అధ్యక్షుడు మానేపల్లి రామారావు, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మహాకుంభప్రోక్షణ, గోష్ఠి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రామారావు, ఆలయ అర్చకులు



స్వర్ణగిరి క్షేత్రంలో అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

# కుటుంబ సమస్యలతో గృహిణి ఆత్మహత్య

**నిడమనూరు:** కుటుంబ సమస్యలతో ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండల కేంద్రంలో నివాసముంటున్న మల్లికంటి శ్రీను బంకాపురం గ్రామ శివారులోని ఓ రైస్‌మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య కవిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శ్రీను మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగడం మానేయమని శ్రీనుకు పలుమార్లు భార్య కవిత చెప్పినా పట్టించుకోలేదు. ఇటీవల రైస్‌మిల్లులో దసరా బోనస్ రూపంలో వచ్చిన డబ్బుతో శ్రీను మద్యం తాగడంతో, జీవితంపై విరక్తి చెందిన కవిత మంగళవారం ఇంట్లోని టాయిలెట్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి తర్వాత ఆమె కుమార్తెలు గమనించి చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. వెంటనే 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## పురుగుల మందు తాగి..

**చండూరు:** పురుగుల మందు తాగి ఆశా వర్కర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. అంగడిపేటకు చెందిన పెద్దబోయిన రేణుక ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. ఆమెకు భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుమార్తె అదే గ్రామంలో తమ ఇంటి ఎదురుగా ఉండే ఇడికూడ నాగరాజును ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన రేణుక మూడు నెలలుగా నల్లగొండలో తన తల్లి వద్ద ఉంటోంది. సోమవారం అంగడిపేటకు వచ్చిన రేణుక కుమార్తె వద్దకు వెళ్లి తమ వద్దకు రావాలని కోరగా.. ఆమె తిరస్కరించింది. దీంతో సూసైడ్ నోట్ రాసి ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆశా వర్కర్ రేణుక (ఫైల్)

## కరాటేలో వరల్డ్ రికార్డు సాధించిన రామకృష్ణానాయక్

**మిర్యాలగూడ టౌన్:** మిర్యాలగూడ పట్టణంలోని సుమన్ షాటోఖాన్ కరాటే అకాడమీ కరాటే మాస్టర్ బాండావత్ రామకృష్ణానాయక్ ఉమ్మడి జిల్లాలో 67,776 మంది విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చి వరల్డ్ రికార్డు సాధించారు. ఈ నెల 5న చెన్నైలోని ఎస్‌ఐవీఈటీ కళాశాలలో వరల్డ్ కరాటే మాస్టర్ బాలమురుగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్ రికార్డు కార్యక్రమంలో రామకృష్ణానాయక్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందుకున్నారు. రామకృష్ణనాయక్‌ను ప్రముఖ సినీ నటుడు, సుమన్ షాటోఖాన్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు సుమన్, అకాడమీ కరాటే మాస్టర్ బుడిద సైదులు అభినందించారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న రామకృష్ణానాయక్

## యువతి అదృశ్యం

**చిట్యాల:** చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు మంగళవారం ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టంపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి సత్తిరెడ్డి కుమార్తె లావణ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి మానేసి గత ఆరు నెలలుగా స్వగ్రామంలోనే ఉంటోంది. ఈ నెల 6న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన లావణ్య తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తన కుమార్తె అదృశ్యం కావడానికి ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా సంతపేట గ్రామానికి చెందిన రవిచంద్ర అనే యువకుడు కారణమని మంగళవారం యువతి తండ్రి చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# పంటల్లో తెగుళ్ల నివారణపై అవగాహన

**మేళ్లచెరువు:** పత్తి, వరి, మిరప పంటల్లో వచ్చే తెగుళ్లపై మంగళవారం చింతలపాలెం మండలంలో రైతులకు గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త సీహెచ్. నరేష్ మాట్లాడుతూ.. ఇటీవల వర్షాలు ఎక్కువగా కురవడంతో నేలలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో పత్తి పంటలో ఎరువులు వేసుకోవడం అనుకూలంగా ఉందన్నారు. తేమ ఎక్కువగా ఉండడంతో రసం పీల్చే పురుగు పచ్చదోమ, తెల్లదోమ కనిపించిన వెంటనే అసిటమిప్రైడ్ 0.2గ్రాములు లీటరు నీటికి లేదా వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా పసుపు రంగు జిగురు అట్టలు వాడుకోవాలని సూచించారు. అదేవిధంగా వేరుకుళ్లు, మొదళ్లు కుళ్లు వంటివి రావడానికి ఆస్కారం ఉందన్నారు. కావున రైతులు హెక్సాకాన్ జోల్ 1మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మిరప పంటలో వచ్చే తెగుళ్లకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి భవాని, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పద్మావతి, సుష్మిత, శరణ్య తదితరులు పాల్గొన్నారు.



తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్న గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు

# అధిక వడ్డీ ఆశచూపి మోసం

- వడ్డీ వ్యాపారి ఇంటికి నిప్పు పెట్టిన బాధితులు



బాలాజీనాయక్ ఇంటికి నిప్పు పెట్టి ఆందోళన చేస్తున్న బాధితులు

**పెద్దఅడిశర్లపల్లి:** అధిక వడ్డీ ఇస్తానని ఆశచూపి పలువురి వద్ద డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన వడ్డీ వ్యాపారి ఇంటిని మంగళవారం బాధితులు ముట్టడించారు. అతడి ఇంటికి నిప్పు పెట్టి దహనం చేశారు. పెద్దఅడిశర్లపల్లి మండలం పలుగుతండాకు చెందిన వడ్డీ వ్యాపారి బాలాజీనాయక్ గ్రామస్తులు, బంధువులతో పాటు దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో అధిక వడ్డీ ఆశ చూపి కోట్ల రూపాయలు వసూలు చేసి తిరిగి చెల్లించడంలేదు. దీంతో రెండు నెలల క్రితం బాధితులు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో బాలాజీనాయక్‌ను ఎస్పీ కార్యాలయానికి పిలిపించి విచారించగా.. మూడు నెలల్లో బాధితులందరికి డబ్బులు ఇస్తానని అంగీకరించాడు. అప్పటి నుంచి రోజులు గడిచే కొద్దీ మరితం సమయం ఇవ్వాలని బాధితులను కోరుతూ కాలయాపన చేస్తున్నాడు. గత కొన్నిరోజులుగా అతడు అందుబాటులోకి రాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. మిర్యాలగూడకు చెందిన రమావత్ సరియా తనతో పాటు తన బంధువుల వద్ద అప్పుగా తీసుకొని బాలాజీనాయక్‌కు ఇచ్చింది. గత మూడు నెలలుగా బాలాజీనాయక్ చుట్టూ తిరగుతున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన సరియా సోమవారం మిర్యాలగూడలో పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం ఆమెను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మండలంలోని పలువురు బాధితులు మంగళవారం బాలాజీనాయక్ ఇంటి వద్దకు రాగా.. ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో ఆగ్రహించిన బాధితులు అతడి ఇంటికి నిప్పు పెట్టి ఫర్నీచర్‌ను బయటకు తీసుకొచ్చి దహనం చేశారు.

## జాతీయ రహదారిపై కారు దగ్ధం

**చౌటుప్పల్ రూరల్:** హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి ఓ కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విశాఖపట్నంకు చెందిన ఎ. సంతోష్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఐఎస్‌బీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 7గంటలకు అతడు గచ్చిబౌలి నుంచి విశాఖపట్నంకు కారులో బయల్దేరాడు. మార్గమధ్యలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ దాటుతుండగా హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కారులో నుంచి పొగ వస్తుండటం గమనించి మోహర్‌నగర్ వెళ్లే రోడ్డు సమీపంలో కారు ఆపాడు. ఈ క్రమంలో కారులో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనాదారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. కారులో ఒక్కరే ఉండడం అతడికి ఎలాంటి గాయాలు కాలేదు.



దగ్ధమవుతున్న కారు

# చింపాంజీ మాస్క్.. కోతులు షాక్

- వానరాల బెడదను అరికట్టేందుకు పంచాయతీ కార్యదర్శి వినూత్న ఆలోచన

**రాజాపేట:** రాజాపేట మండలం మల్లగూడెం గ్రామ పంచాయతీలో కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు గ్రామ పంచాయతీ సిబ్బందికి చింపాంజీ మాస్క్ వేయించి వాటిని భయపెట్టే ఉపాయం చేశాడు ఆ ఊరి గ్రామ పంచాయతీ కార్యదర్శి. వివరాలు.. మలగూడెం గ్రామం పక్కనే అడవి ఉండడంతో కోతులు గ్రామంలోకి వచ్చి ప్రజలపై దాడి చేస్తున్నాయి. రైతులు వేసిన ఏ పంట వేసినా నాశనం చేస్తున్నాయి. గ్రామ శివారులో పాఠశాల ఉండడంతో మధ్యాహ్నం భోజనం సమయంలో విద్యార్థులపై దాడికి దిగేవి. ఈ పరిస్థితిని గమనించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి చక్రిధర్ వినూత్న ఆలోచన చేశాడు. ఆన్‌లైన్‌లో చింపాంజీ మాస్కును రూ.1500కు కొనుగోలు చేశాడు. గ్రామ పంచాయతీ సిబ్బందికి చింపాంజీ మాస్కు వేయించి కోతులు వచ్చిన సమయంలో వాటిని వెంబడిస్తూ పరిగెత్తించాడు. ఇలా గత నెల రోజుల్లో రెండు మూడు సార్లు గ్రామంలోకి వచ్చిన కోతులను చింపాంజీ వేషధారణతో భయపెట్టసాగారు. దీంతో ప్రస్తుతం గ్రామంలోకి కోతులు రావాలంటేనే జంకుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా కోతుల బెడదతో ఇబ్బంది పడ్డ గ్రామస్తులు, రైతులు గ్రామ పంచాయతీ కార్యదర్శి చక్రిధర్ చేసిన ఆలోచనకు కోతుల బెడదకు చెక్ పెట్టినట్లు అయ్యిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



చింపాంజీ మాస్క్ ధరించిన మల్లగూడెం గ్రామ పంచాయతీ సిబ్బంది



# ఎరలతో చీడపీడలకు చెక్

**గుర్రంపోడు:** పంట దిగుబడి తగ్గడానికి తెగుళ్లతో పాటు పురుగులు ప్రధాన కారణం. చీడపీడల నివారణకు విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు వాడటం వల్ల ఆశించిన ఫలితాలు రాకపోవడమే కాకుండా పెట్టుబడులు పెరుగుతున్నాయి. పురుగు మందులు విచ్చలవిడిగా వాడటం వల్ల మిత్ర పురుగులు నశిస్తున్నాయి. ఈ క్రమంలో రైతులు ఖర్చులు తగ్గించుకుని, మిత్ర పురుగులు కాపాడుకోవడానికి లింగాకర్షణ బుట్టలు, స్టిక్ ఏ ఫ్లయ్, ఎల్లో స్టిక్కీ ట్రాప్స్ ఎంతగానో ఉపయోగపడతాయని ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి సూచిస్తున్నారు.

**లింగాకర్షణ బుట్టలు**

పంటలను ఆశించే పురుగులు ఒక పురుగు నుంచి మరో పురుగుకు వచ్చే కొన్ని రకాల వాసనల వల్ల ఆకర్షించబడతాయి. తద్వారా పురుగుల ఉధృతి పెరుగుతుంది. వీటి నివారణకు లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవాలి. వీటిలో కొన్ని రకాల వాసనల వల్ల ఆడ పురుగు, మగ పురుగును ఆకర్షించే వీలు కలుగుతుంది. ఈ బుట్టలను నెలకు ఒకటి చొప్పున మార్చాలి. పురుగుల ఉధృతిని గుర్తించేందుకు ఎకరాకు 4 బుట్టలు, వీటి నివారణకు తర్వాత ఎకరాకు 10 బుట్టలు అమర్చాలి. లింగాకర్షణ బుట్టలు అన్ని రకాల పంటలకు ఉపయోగించవచ్చు. వరి, మొక్కజొన్న, పత్తి, అన్ని రకాల కూరగాయలకు లింగాకర్షణ బుట్టలు వాడవచ్చు. ఒక్కో పురుగును ఆకర్షించడానికి ఒక్కో రకమైన బుట్టలు ఆయా పంటలను ఆశించే పురుగులను బట్టి బుట్టలు అమర్చాలి. 25 నుంచి 30 రోజులకు బుట్టలను మార్చాలి. ముఖ్యంగా పురుగు మందులు వాడేటప్పుడు



కూరగాయ తోటలో లింగాకర్షణ బుట్టలు

**ఎల్లో స్టిక్కీ ట్రాప్**

దీనిని స్టిక్ ఏ ఫ్లయ్ అంటారు. రసం పీల్చు పురుగుల నివారణకు ఇవి ఉపయోగపడతాయి. ఎల్లో స్టిక్కీ ట్రాప్ ఉపయోగించి తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, తామర పురుగు, ఆకుముడత పురుగు, పచ్చదీపపు పురుగును అరికట్టవచ్చు. ఇవి పసుపు రంగుకు ఆకర్షితమై ట్రాప్ ఉన్న జిగురుకు అంటుకుపోతాయి.

**తొలిదశ నుంచే ఎరలు వాడాలి**

పంట తొలిదశ నుంచి పురుగు ఉనికి కనబడక ముందు నుంచే వాడి, పురుగు ఉనికి గుర్తిస్తే మొక్కలను కదల్చడం ద్వారా ప్రత్యేకించి తెల్లదోమ పురుగులు ఎక్కువగా అంటుకుంటాయి. 50శాతం కన్నా ఎక్కువ పురుగులతో నిండే వరకు ఎన్ని నెలలైనా ఇవి పనిచేస్తుంటాయి. 50శాతం కన్నా ఎక్కువ పురుగులు నిండగానే ఇవి మార్చుకోవాలి. ఎరను తూర్పు, పడమర దిశల్లో ఎకరానికి 10 లింగాకర్షణ బుట్టలు అమర్చి పైన ఉన్న పేపరు తొలగించాలి. పురుగు ఉదతిని గమనిస్తూ నివారణ చర్యలు చేపట్టాలి. ప్రధానంగా కూరగాయలు, పండ్లతోటల్లో కాయతొలుచు పురుగు లాంటి నివారణకు ఎరల ద్వారా నివారించవచ్చు.